క్లుప్తంగా

సామూహిక సత్యనారాయణ వ్రతం



నాగాయలంక:శ్రీలక్ష్మీదేవి జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వ్రతమాచరించారు. అనంతరం స్థానిక భజన మండలి, గీతాసమాజం మహిళలచే భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. తొలుత శ్రీరుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి శ్రీలక్ష్మీదేవి పీఠం వద్ద విశేష పూజలు చేశారు. గీతాసమాజం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పార్టీ పదవులు పొందిన నేతలకు అభినందనలు



అవనిగడ్డ: వైఎస్సార్‌ సీపీలో పలు పదవులు పొందిన నాయకులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌ బాబు శుక్రవారం అభినందించారు. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌గా రెండోసారి నియమితులైన రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ పంచాయతీ రాజ్‌ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సింహాద్రి వెంకటేశ్వరరావుని రమేష్‌ బాబు అభినందించారు.

వైఎస్సార్‌ సీపీ లీగల్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా అంకరాజు



చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్‌ సీపీ లీగల్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి పల్లపోతు అంకరాజు నియమితులయ్యారు. వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అంకరాజు ఆరవ అదనపు జిల్లా కోర్టుకు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. ప్రస్తుతం న్యాయవాదిగా, నోటరీగా కూడా పనిచేస్తున్నారు. పలువురు వైఎస్సార్‌ సీపీ నేతలు అంకరాజుకు అభినందనలు తెలియజేశారు.

కనులపండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. వేద పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు.

ప్రారంభమైన దయాకుంభ్‌ ఉత్సవం



మచిలీపట్నంటౌన్‌: నగరంలోని బలరామునిపేటలో వేంచేసి ఉన్న జగద్గురు శ్రీరామానుజాచార్య సంస్థాన్‌లో దయాకుంభ్‌-2025 (శ్రీలక్ష్మి జయంతి) ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శ్రీమాన్‌ గుదిమెళ్ల శ్రీనివాస శ్రీకర్‌స్వామి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉదయం శ్రీలక్ష్మీనారాయణ ఇష్టి, సాయంత్రం లక్ష్మీనారాయణ యజ్ఞం, సహస్రగళ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణ, లక్ష్మీనారాయణ కల్యాణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను శ్రీనివాస శ్రీకర్‌ స్వామి పర్యవేక్షించారు.

అయ్యప్పకు తిరునక్షత్ర పూజలు



కోడూరు: కోడూరు అయ్యప్పస్వామివారి ఆలయంలో శుక్రవారం స్వామివారి తిరునక్షత్ర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అయ్యప్ప మూలవిరాట్‌కు భక్తులు స్వయంగా అభిషేకం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీఅద్దంకి నాంచారమ్మ ‘జన’జాతర

- జాతరకు పోటెత్తిన భక్తజనం
- అమ్మవారికి పాలపొంగళ్లు, పట్టువస్త్రాల సమర్పణ



అద్దంకి నాంచారమ్మ అమ్మవారు



జాతరలో భక్తుల కోలాహలం

కోడూరు: కృష్ణా తీరంలోని విశ్వనాథపల్లి గ్రామం జనజాతరతో పోటెత్తింది. శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన జాతరను పురస్కరించుకొని శుక్రవారం తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్దఎత్తున తరలి వచ్చారు. ముఖ్యంగా అమ్మవారి పుట్టింటివారైన గుంటూరు, ప్రకాశం జిల్లాల భక్తులు నాంచారమ్మ తల్లి దర్శనానికి బారులుతీరారు. హైదరాబాద్‌, ఉభయగోదావరి, విశాఖపట్నం, విజయవాడకు చెందిన భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒకరూ జాతరలో ఉత్సాహంగా పాల్గొని తమ భక్తిభావం చాటుకున్నారు. కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

సంతానం కోసం మహిళలు ప్రాణాచారం

నాంచారమ్మ తల్లికి ఒడుగంటి బియ్యం సమర్పించి ఆలయం వెనుక భాగంలో కదలకుండా అమ్మ నామస్మరణతో ప్రాణాచారం చేస్తే సంతానం కలుగుతుందని మహిళల ప్రగాఢ విశ్వాసం. దీంతో మహిళలు ఈ ప్రాణాచారం చేసి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. ప్రాణాచారం చేస్తున్న మహిళలపై భక్తులు పసుపు, కుంకుమ చల్లుతూ దీవెనలు అందించారు. కొంతమంది భక్తులు తమ పిల్లలను ఆలయం ఎదుట ధ్వజస్తంభానికి కట్టగా మేనమామ వరుసవారు వేలం ద్వారా విడిపించుకున్నారు. పాలపొంగళ్లు, పట్టువస్త్రాలు, చీరలు, నైవేద్యాలను భక్తులు అమ్మవారికి సమర్పించారు. యువకులు డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

త్రిశూలధారిణిగా నాంచారమ్మ మూలమూర్తి

జాతర నేపథ్యంలో నాంచారమ్మ మూలమూర్తిని త్రిశూలధారిణిగా అలంకరించారు. భక్తులు సమర్పించిన చీరలు, గాజులు, పూలదండలతో ముస్తాబు చేశారు. తల్లి దివ్యస్వరూపాన్ని తిలకించి భక్తులు పరవశించారు. నాంచారమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ సతీమణి విజయలక్ష్మి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ విద్యశ్రీ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాలపొంగళ్లు, పట్టువస్త్రాలతో వచ్చిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రవి అస్తమించని సేవా సామ్రాజ్యం ‘లయన్స్‌ క్లబ్‌’



మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ గద్దె శేషగిరి

చల్లపల్లి: ప్రపంచవ్యాప్తంగా 207 దేశాల్లో దాదాపు 50వేల క్లబ్‌లతో నిత్యం సేవలు అందిస్తూ రవి అస్తమించని సేవా సామ్రాజ్యంగా లయన్స్‌ క్లబ్‌ వెలుగొందుతోందని డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ లయన్‌ గద్దె శేషగిరి పేర్కొన్నారు. స్థానిక నర్రా రమాదేవి-సాయిబాబు లయన్స్‌ మల్టీపర్పస్‌ సర్వీస్‌ సెంటర్‌లో లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ చల్లపల్లి వీఆర్‌కేనగర్‌ ఆధ్వర్యాన అధికారిక పరిశీలన, చార్టర్స్‌ సభ్యుల అభినందన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. చల్లపల్లి లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో శేషగిరి మాట్లాడుతూ 27 ఏళ్ల నుంచి చల్లపల్లి లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో ఇప్పటి వరకు ఎనిమిది వేల మందికిపైగా కంటి ఆపరేషన్లు చేయించారని అభినందించారు. అలాగే చల్లపల్లిలో క్లబ్‌ ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు సేవలు అందిస్తున్న చార్టర్‌ సభ్యులను లయన్స్‌ ఇంటర్నేషనల్‌ బ్యాడ్జీలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ వైపీసీ ప్రసాద్‌, మాజీ జీఏటీ వైస్‌ చైర్‌పర్సన్‌ సీహెచ్‌ శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్‌ చక్రధర్‌, ఏరియా రిప్రజెంటేటివ్‌ కేఎస్‌వీఆర్‌కే ప్రసాద్‌, రీజియన్‌ చైర్‌పర్సన్‌ యు రాంబాబు, చల్లపల్లి లయన్స్‌ క్లబ్‌ కార్యదర్శి కస్తూరి ప్రసాద్‌, కోశాధికారి ఎం రాజకుమార్‌(నాని), జిల్లా కార్యవర్గ సభ్యులు, లయన్స్‌ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ వేడుకలు



మచిలీపట్నంలో హోలీ వేడుకల్లో చిన్నారులు



నాగాయలంకలో హోలీ వేడుకల్లో ఓ కుటుంబం

మచిలీపట్నంటౌన్‌: నగర వాసులు హోలీ వేడుకలను శుక్రవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. చిన్నారులు, యువత, పెద్దలు ఒకరినొకరు రంగులు పూసుకుని సందడి చేశారు. నగరంలోని నారాయణపురం, దేవునితోట, అమృతపురం తదితర ప్రాంతాల్లో ఉన్న యానాదుల కాలనీల్లోని పిల్లలు, పెద్దలు రంగులు పూసుకుని సందడి చేశారు.

నాగాయలంక: హోలీ వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సందడిగా జరుపుకొన్నారు. నాగాయలంకలోని పలు వీధుల్లో చిన్నారులు, యువత, పెద్దలు రంగు నీళ్లను ఎంతో ఉత్సాహంగా చల్లుకున్నారు.

అలరించిన మహిళల మురళీ కోలాటం



మహిళా కోలాట బృందం

చల్లపల్లి: శ్రీదుర్గాసోమేశ్వర మహిళా మురళీ కోలాట బృంద సభ్యులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. మండల పరిధిలోని లక్ష్మీపురంలో వేంచేసియున్న శ్రీబాలా త్రిపురసుందరీ సమేత లక్ష్మీనాంచారమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం కోలాటం ప్రదర్శించారు. గ్రామంలోని మహిళలు బృందంగా ఏర్పడి నేర్చుకుని మొదటి ప్రదర్శన అమ్మవారి ఆలయంలో ప్రదర్శించినట్లు కోలాటం గురువు మారీతి తెలిపారు. కార్యక్రమాన్ని శ్రీదుర్గా సోమేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు భమిడిపాటి బాలసుబ్రహ్మణ్యశర్మ, నాంచారమ్మ తల్లి దేవస్థానం కమిటీ సభ్యుడు దాలిపర్తి నారాయణరావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కోనేరుసెంటర్‌: మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్‌ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు మచిలీపట్నం విద్యుత్‌శాఖ ఈఈ జీ గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నాపురం, వాడపాలెం సబ్‌స్టేషన్‌ల మెయింటనెన్స్‌ల దృష్ట్యా శనివారం ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు చిన్నాపురం, పెదయాదర, చిన్న యాదర, ఎస్‌ గొల్లపాలెం, వాడగొయ్యి, వాడపాలెం, కేపీటీపాలెం, ఎస్‌ఎన్‌పురం, వెంకటదుర్గాంబపురం గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అవనిగడ్డ: నాగాయలంక రోడ్డులోని కొత్త సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు డివిజన్‌ ఈఈ డీ కృష్ణనాయక్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని రెండు నుంచి తొమ్మిది వార్డుల వరకు, కొత్తపేట, రామకోటిపురం, బందలాయిచెరువు, గుడివాకవారిపాలెం, ఎడ్లంక, వేకనూరు, తుంగలవారిపాలెం గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన విద్యార్థి



రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జెతిన్‌ మణికంఠ

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ, విభా లీఫ్‌ ఫార్వర్డ్‌ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వర్డ్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో స్థానిక ప్రాథమిక పాఠశాలకు చెందిన మూడో తరగతి విద్యార్థి జెతిన్‌ మణికంఠ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కే విజయనిర్మల తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ తమ విద్యార్థి జెతిన్‌తో పాటు విద్యార్థినులు దాసరి జోష్నశ్రీ, దాసరి తన్మశ్రీ రెండు, నాలుగో స్థానాలు పొందినట్లు వివరించారు. గురువారం విజయవాడ భవానీపురం బెరంపార్కులో జరిగిన కార్యక్రమంలో సమగ్ర శిక్ష స్టేట్‌ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ బీ శ్రీనివాసరావు చేతులమీదుగా సైకిల్స్‌, స్టడీటేబుల్‌, స్మార్ట్‌ వాచ్‌, బ్లూటూత్‌, స్కూల్‌ బ్యాగ్‌లు విజేతలకు అందజేశారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్‌ అంబటి శ్యామ్‌ప్రసాద్‌, ఎంఈఓలు టీవీఎం రామదాసు, రామారావు అభినందించారు.

పురవాసులకు శుద్ధజలం



వాటర్‌ హెడ్‌ వర్క్స్‌లో ప్రధాన పైపు లైనుకు లీకులు కాకుండా బిగించిన కొత్త వాల్వులు



కొత్తగా కొనుగోలు చేసి బిగించడానికి తీసుకువచ్చిన మోటార్లు

- వాటర్‌ హౌస్‌లో రూ.30లక్షలతో మరమ్మతులు
- గత ప్రభుత్వంలో నిధులు కేటాయింపు

పెడన: పట్టణంలో 35వేల మంది వరకు జనాభా కలిగిన వారికి తాగునీరు సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన వాటర్‌ హెడ్‌ వర్క్స్‌లో ప్రస్తుతం ముమ్మరంగా మరమ్మతులు చేపట్టారు. పురప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో డిస్ట్రిక్ట్‌ మినరల్‌ ఫౌండేషన్‌(డీఎంఎఫ్‌ఎఫ్‌) ఫండ్స్‌ రూ.30లక్షలను గత ఏడాది ఫిబ్రవరిలో మంజూరు చేశారు. తర్వాత ఎన్నికలు రావడం, కోడ్‌ అడ్డంకిగా మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత జిల్లా కలెక్టర్‌ గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వడంతో పనులు వేగవంతమయ్యాయి.

ఇబ్బందులు పడుతున్న పురప్రజలు

1998లో హెడ్‌వాటర్‌ వర్క్స్‌ అందుబాటులోకి రావడంతో పాటు అప్పటి నుంచి ఒకసారి మాత్రమే నామమాత్రంగా ఫిల్టర్‌ బెడ్‌లను బాగు చేయించారు. పూర్తిస్థాయిలో చేయించకపోవడంతో అప్పటి నుంచి పైపులు, వాల్వ్‌లు, మోటార్లు తరచూ రిపేర్లు రావడం, వాల్వ్‌లు నుంచి లీకులు కావడం, ఫిల్టర్‌ బెడ్‌లో నీరు నిల్వ ఉండి మురుగుడు వాసన వస్తుండటంతో పురప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలోని పాలకుల దృష్టికి మున్సిపల్‌ పాలకవర్గం తీసుకువెళ్లడంతో వాటర్‌ వర్క్స్‌లో మరమ్మతులకు రూ. 30లక్షలు డీఎంఎఫ్‌ఎఫ్‌ వచ్చేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రాము, జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారిక చొరవతో ఈ నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచి పనులు అప్పగించి ఆయా పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

నాలుగు ఫిల్టర్‌ బెడ్లు.. ఏడు మోటార్లు

ఈ నేపథ్యంలో నాలుగు ఫిల్టర్‌ బెడ్‌లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. వీటిలో ఒకదాని తర్వాత ఒకటి మరమ్మతులు చేస్తూ నీటి సరఫరాకు అంతరాయం లేకుండా పనులు చేస్తున్నారు. 10 హెచ్‌పీ మోటార్లు మూడు, 7.5 హెచ్‌పీ మోటారు ఒకటి, 3 హెచ్‌పీ మోటార్లు రెండు, ఒక హెచ్‌పీ మోటారు ఒకటి కొత్తగా కొనుగోలు చేసి బిగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. వాల్వ్‌ల మార్పులు కూడా చేసి ఎక్కడా లీకులు కాకుండా నిలువరించేలా చర్యలు తీసుకున్నారు. పురప్రజలకు రోజుకు 45లక్షలు లీటర్లు తాగునీరు అవసరం. అయితే ప్రస్తుతం 36లక్షలు లీటర్లు మాత్రమే నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. వాటర్‌వర్క్స్‌లో మరమ్మతులు త్వరగా పూర్తి చేసి శుద్ధజలాన్ని పురప్రజలకు అందించడానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్‌ ఏఈ సీతారామాంజనేయులు పేర్కొంటున్నారు.

నేడు కౌన్సిల్‌ సాధారణ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్‌ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్‌ మీటింగ్‌ హాలులో నిర్వహించనున్నట్లు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కటకం నాగకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అజెండాలోని 40 అంశాలపై చర్చించి ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. కావున కౌన్సిల్‌ సభ్యులు, కోఆప్షన్‌ సభ్యులు, ఆయా విభాగాలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

నేడు రంగా విగ్రహావిష్కరణ

నంగేగడ్డ(నాగాయలంక): గ్రామంలోని ప్రధాన కూడలిలో చెరువు ఒడ్డున ఏర్పాటు చేసిన కాపు ఉద్యమనేత, దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహక ప్రతినిధులు కోసూరు పవన్‌, సనకా యుగంధర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌, ఎంపీ వల్లభనేని బాలశౌరి విగ్రహావిష్కరణ చేస్తారని పేర్కొన్నారు. రంగా అభిమానులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు వంతెన ప్రారంభం

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం యండపల్లి స్లోపు వద్ద ప్రధాన పంటకాలువపై రూ. 75 లక్షలు ఎంపీ ల్యాండ్స్‌ నిధులతో నిర్మించిన వంతెన శనివారం ప్రారంభంకానుంది. గత వైఎస్సార్‌ సీపీ హయాంలో వంతెనకు నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రారంభోత్సవానికి ఎంపీ వల్లభనేని బాలశౌరీతో పాటు స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ హాజరుకానున్నారు.

ఇసుక క్వారీలో ఘర్షణ

ఘంటసాల: ఇసుక క్వారీలో జరిగిన ఘర్షణపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఘంటసాల మండలం శ్రీకాకుళం ఇసుక క్వారీలో అఖిల్‌ సూపర్‌ వైజర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఇసుక సీనరేజ్‌ ధరలు తగ్గించాలని గురువారం లారీ ఓనర్లు కోరారు. దీంతో తాత్కాలికంగా ఇసుక లోడింగ్‌ ఆపివేసి మరలా అదేరోజు రాత్రి లోడింగ్‌ చేస్తుండగా సమస్య పరిష్కారం కాకుండా ఎలా లోడింగ్‌ చేస్తారంటూ లారీ ఓనర్లు, నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. ఈ ఘర్షణలో సూపర్‌ వైజర్‌ అఖిల్‌పై మల్లికార్జునరావు, ఆంజనేయులు, పలువురు లారీ ఓనర్లు చేసిన దాడి చేయగా గాయాల పాలైయ్యాడు. బాధితుడు అఖిల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కే ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

• కరుణించమ్మా.. కాపాడమ్మా




నాంచారమ్మ తల్లి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారు

పెదప్రోలు(మోపిదేవి): మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామంలో కొలువైయున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, తమ పశువులతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు నిరీక్షించారు. ఆలయాన్ని విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించారు.



విద్యుత్‌ కాంతుల వెలుగుల్లో నాంచారమ్మ తల్లి ఆలయం

మున్సిపాలిటీ, మండల పార్టీ అధ్యక్షుల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని గుడివాడ, పెడన మున్సిపాలిటీలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్‌ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పామర్రు టౌన్‌కు నందిపాటి సురేష్‌రెడ్డి, పామర్రు మండలానికి కాకర్ల వెంకటేశ్వరరావు, మొవ్వ మండలానికి రాజులపాటి రాఘవరావు, పమిడిముక్కల యలమంచిలి గణేష్‌ బాబు, పెదపారుపూడి గోగం సురేష్‌, తోట్లవల్లూరు కళ్లం వెంకటేశ్వరరెడ్డిలను నియమించారు. గుడివాడ పట్టణ అధ్యక్షుడిగా గోర్ల శ్రీనివాసరావు, గుడివాడ మండలానికి చిన్ని సత్యదుర్గాప్రసాద్‌, గుడ్లవల్లేరు శాయన రవికుమార్‌, నందివాడ పెయ్యల ఆదాంలను మండల అధ్యక్షులుగా నియమించారు. అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అవనిగడ్డ మండలం రేపల్లె శ్రీనివాసరావు, చల్లపల్లి శీలం సత్యనారాయణ (నాని), ఘంటసాల వేమూరి వెంకట్రావు, కోడూరు పరిశె మాధవరావు, మోపిదేవి గరికిపాటి వెంకటేశ్వరరావు, నాగాయలంక భోగాధి శేషగిరిలను మండలాధ్యక్షులుగా నియమించారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ.!



చల్లపల్లి ఆర్టీసి బస్టాండు వద్ద ఉదయం మంచుతో కప్పబడిన రోడ్డు



అదే రోడ్డులో మధ్యాహ్నం ఎండ వేడిమికి జనాలు లేక వెలవెలబోతున్న దృశ్యం

చల్లపల్లి: ఉదయం వేళల్లో మంచు కురవడం.. మధ్యాహ్నానికి ఎండలు మండటంతో రెండు విభిన్న వాతావరణాల మధ్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం మంచులో సేదతీరిన ప్రజలు మధ్యాహ్న సమయాల్లో ఎండ వేడిమిని తట్టుకోలేకపోతున్నారు. దీంతో రద్దీగా ఉండే రోడ్లు జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మును ముందు ఇంకెంత ఎండలు మండుతాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రానున్న రోజుల్లో ఎండ వేడి మరింత ఎరిగే అవకాశం ఉండటంతో ఎండ తీవ్రతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని బయటకు రావాలని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ఆక్సిజన్‌ కాన్సన్‌ట్రేటర్‌ అందజేత

పెడన: పట్టణ అర్బన్‌హెల్త్‌ సెంటర్‌(యూపీహెచ్‌సీ)కు రూ. 90వేలు విలువైన ఆక్సిజన్‌ కాన్సన్‌ట్రేటర్‌ను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ శుక్రవారం అందజేశారు. పెడన పార్టీ కార్యాలయంలో యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్‌ టీ హిమ పద్మజకు కాన్సన్‌ట్రేటర్‌ను అందించారు. బీసీ కార్పొరేషన్‌ రాష్ట్ర మాజీ చైర్మన్‌ బొడ్డు వేణుగోపాలరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు శెలపాటి ప్రసాద్‌, శీరం ప్రసాద్‌ పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 42 మందికి రూ.32.60 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు.

చేపల చెరువులో విష ప్రయోగంపై కేసు నమోదు

బంటుమిల్లి: చేపల చెరువులో జరిగిన విష ప్రయోగం ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని జయపురం గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నాగమునేంద్రరావు రెండు ఎకరాల చేపల చెరువు సాగు చేస్తున్నాడు. రెండు రోజుల్లో చేపల పట్టుబడి చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా గురువారం చేపల చెరువులో ఫ్యాన్లు వేసేందుకు వెళ్లగా చేపలు నీటిపై తేలి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారనే అనుమానంతో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.